
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024




రూ.1,00,116 విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన జగదీష్, సుధాలక్ష్మీ దంపతులు రూ.1,00,016 విరాళమిచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 582.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,989 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,902 క్యూసెక్కులు విడుదల చేశారు. కింది కాలువలకూ నీటిని పంపారు.

న్యూస్‌రీల్

రిటర్నబుల్ ప్లాట్లకు ఈ- లాటరీ



తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణానికి ఏపీ సీఆర్డీఏకు భూ సమీకరణలో భాగంగా భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు గురువారం విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ- లాటరీ నిర్వహించారు. ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యార్థం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ఎస్ రాజకుమారి తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ క్రతువును పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ- లాటరీకి హాజరైన రైతులకు అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ నేతృత్వంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రైల్ రన్ వేసి, తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టారు. లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు వారి భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించేందుకు ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. మొత్తం 13 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్షియల్- 130, కమర్షియల్- 113 ప్లాట్లు అందజేశారు.

15న సోమేపల్లి సాహితీ సౌరభం

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ హాల్ ఆవరణలో 'సోమేపల్లి సాహితీ సౌరభం' నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆహ్వాన సంఘం నాయకులు చలపాక ప్రకాష్, ఎస్ఎం.సుభాని, సోమేపల్లి వశిష్ట గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సోమేపల్లి వెంకట సుబ్బయ్య స్మారక సంచిక ఆవిష్కరణ, 11 గంటలకు సోమేపల్లి సాహిత్య సదస్సు ఉంటాయన్నారు. అనంతరం నానా రచనలు నానీలు ఆవిష్కరణ సభ జరుగుతుందని పేర్కొన్నారు. 15వ జాతీయ స్థాయి సోమేపల్లి సాహితీ పురస్కారాల సభలో రాత స్మరణీయులు పుస్తకావిష్కరణ, ఐదుగురు ప్రముఖ రచయితలకు పురస్కారాల ప్రదానం ఉంటాయని అన్నారు.

టమాటా లోడు లారీ బోల్తా



గుంటూరు రూరల్: బుడంపాడు సమీపంలోని ఎన్‌హెచ్ 16లో చిలకలూరిపేట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టమాటా లోడు లారీ గురువారం తెల్లవారుజామున బోల్తా పడింది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు టమాటా లోడుతో వెళుతున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తుతో బుడంపాడు సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో లారీ బోల్తా పడటంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు వచ్చి రెండు గంటలపాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వ్యాపారులు మరో లారీ తీసుకొచ్చి టమాటాలను తరలించారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక




తెనాలి: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ జట్లను గురువారం ఎంపిక చేశారు. జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో జరిగిన ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందమంది పాల్గొన్నారని సంఘ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. జె.సుధాకర్, డి.నాగరాజు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, సర్దార్, ఏఎంజీ రాజు, కుమారి పాల్గొన్నారు.

మార్గదర్శకాల మేరకే ధాన్యం కొనుగోలు

నగరం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని బాపట్ల జాయింట్ కలెక్టర్ ప్రకాష్‌జైన్ చెప్పారు. నగరం మండలం పూడివాడలోని రైతుసేవా కేంద్రం, రైస్‌మిల్లులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కొనుగోలులో ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు.

ఉత్త మాటలు... ఒట్టి చేతలు!



ఒక్కటీ నెరవేరని చంద్రబాబు నాయుడు హామీలు
ఆరు నెలల పాలనలో జిల్లా ప్రజలకు చేసింది శూన్యం

- ఎన్నికల వేళ అధికారం కోసం అడ్డగోలుగా హామీలు
- అన్నదాతల కంట కన్నీరు
- దాడులకు తెగబడుతున్న అధికార పార్టీ నేతలు
- యథేచ్ఛగా ప్రజాప్రతినిధుల దందాలు
- 'రెడ్ బుక్' అమలు పేరిట వేధింపులు
- కూటమి పాలనపై జిల్లా ప్రజల పెదవి విరుపు

ఎన్నికలంటే చాలు చంద్రబాబు నాలుక ఏం మాట్లాడుతుందో ఎవ్వరికీ తెలియదు.. అధికారం దక్కేవరకు కల్లబొల్లి కబుర్లు చెబుతారు... ప్రజలు అమాయకంగా నమ్మి గెలిపించేలా మాయ చేస్తారు. తీరా గద్దెనెక్కాక అంతా మర్చిపోతారు. గతంలో ఎన్నోసార్లు ఈ తరహాలో ప్రజలను నిండా ముంచిన బాబు.. ఇటీవల కూటమిగా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచింది. కానీ నైజం మారలేదు. ఆరు ప్రధాన హామీల అమలు గురించి ఆయన మాట్లాడితే ఒట్టు. విపక్షంపై కక్ష సాధింపునకు మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అడ్డగోలుగా వ్యవహరించడం ఒక్కటే ప్రభుత్వం చేసిన ఏకైక పని.

సాక్షి ప్రతినిధి, గుంటూరు ఎన్నికల ముందు అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, ప్రతి మహిళకు నెలకు రూ. 1,500, అన్నదాతకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ఆశపెట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారు.

రైతులకు తప్పని కష్టాలు

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పలు హామీలు నోటికొచ్చినట్లు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదు. మరోవైపు అన్నదాతలను ప్రభుత్వం పూర్తిగా ముంచేసింది. వరదలకు తీవ్రంగా నష్టపోయిన వారిని పాలకులు గాలికి వదిలేశారు. ఇప్పుడు పంట చేతికి వచ్చినా గిట్టుబాటు ధర ఇప్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు జరిపారు. ప్రతి రైతుకూ మద్దతు ధర వచ్చేలా చూశారు. దళారుల పాత్రను నిర్మూలించగలిగారు. కూటమి ప్రభుత్వం మాత్రం రైతుకు నచ్చిన మిల్లులకు ధాన్యం అమ్ముకోవచ్చని, 60 శాతం దిగుబడి మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నిబంధనలు విధించింది. దీంతో దళారుల విక్రయాలు తారస్థాయికి చేరాయి. జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని వ్యాపారులు ఇక్కడకు వచ్చి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం మద్దతు ధర (75 కిలోల బస్తా) రూ.1,725 ఉన్నా... రైతులకు దళారులు రూ.1,300 నుంచి రూ.1,360 వరకు మాత్రమే ఇస్తున్నారు. పైకి మాటలు చెబుతున్నా రైతులను ఆదుకోవడంలో పాలకులతోపాటు అధికార యంత్రాంగం కూడా పూర్తిగా వెనుకబడింది.

మత్తుకు భవిష్యత్తు చిత్తు

గుంటూరు డ్రగ్స్‌కు కేరాఫ్‌గా మారింది. విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్ మాఫియా చెలరేగిపోతోంది. బెంగళూరు, హైదరాబాద్, గోవాల నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి వినియోగించేవారు కొంత మంది అయితే... విక్రయించేవారు మరికొంత మంది. వరుసగా ఎండీఎంఏ డ్రగ్స్ గుంటూరులో దొరకడం కలవరపెడుతోంది. రోజురోజుకూ డ్రగ్స్ వినియోగం పెరిగిపోతున్నట్లు పోలీసుల దాడుల్లో తరచుగా అవి పట్టుపడటం ద్వారా స్పష్టం అవుతోంది. డ్రగ్ పెడ్లర్స్ కూడా అదే స్థాయిలో మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారు. ఎక్కువగా మంగళగిరి ప్రాంతంలోని ప్రైవేట్ యూనివర్సిటీతోపాటు గుంటూరు చుట్టుపక్కల ఉన్న మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని పెడ్లర్స్ చెలరేగిపోతున్నారు. ఈ కార్యకలాపాలను అడ్డుకోవటంలో కూటమి ప్రభుత్వం కనీస బాధ్యత కూడా లేకుండా వ్యవహరిస్తోంది.

దందాలు.. దౌర్జన్యాలే

మరోవైపు ప్రభుత్వం అధికారంలోకి రాగానే దందాలు, దౌర్జన్యాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై పాలకులు దృష్టి పెట్టారు. కేవలం రెడ్‌బుక్ అమలు పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తున్నారు. పాత కేసులన్నింటినీ మళ్లీ తెరపైకి తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు మాత్రం అడ్డగోలుగా దౌర్జన్యాలు, దందాలు చేస్తున్నారు.

వైఎస్ జగన్ ఉండి ఉంటే...

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉంటే తమకు ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతన్నలు, అక్కచెల్లెమ్మలు అనుకునే పరిస్థితి ఎన్నికలైన ఆరు నెలల్లోనే వచ్చింది. ఐదో విడత అమ్మ ఒడి గత జూన్ నెలలోనే జమ అయ్యేది. కూటమి ప్రభుత్వంలో ఈ విద్యా సంవత్సరంలో అమ్మ ఒడి లేకుండా చేశారు. నాడు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాట్లు పూర్తి అవ్వకుండానే పెట్టుబడి సాయం అందిస్తే... ఇప్పుడు ఖరీఫ్ సీజన్ దాదాపు ముగింపు దశకు చేరుకుని రబీకి సమాయత్తమవుతున్నా చంద్రబాబు చిల్లిగవ్వ కూడా సాయం కూడా చేయలేదు. రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున అప్పటి ప్రభుత్వం అందించింది. ఇప్పుడు ఏడాదికి రూ.20 వేలు మాట పక్కన పెడితే.. అసలు సాయమే అందలేదు.

మహిళలకు రక్షణ కరువు



కూటమి పాలనలో మహిళలకు కూడా రక్షణ లేకుండాపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యువతులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు, రౌడీషీటర్ నవీన్ చేతిలో సహన అనే యువతి హత్యకు గురైంది. ఈ కేసు విషయంలో తాము చెప్పినట్లు చేయలేదని గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్‌పై బదిలీ వేటు వేయడం పాలకుల తీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

గుంటూరుకు చేసిందేమీ లేదు



గుంటూరులోని ప్రతి ఇంటికి పట్టా ఇస్తాం... ఇంటి జాగా లేని వారికి స్థలం ఇస్తాం... టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ఉచితంగా లబ్ధిదారులకు అందిస్తాం.... కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాల నుంచి మండల హెడ్ క్వార్టర్‌కు, మండలం నుంచి జిల్లా కేంద్రాలకు మళ్లీ పూర్తిగా రోడ్లు వేసే బాధ్యత తమదని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. ఇప్పటివరకు ఒక్క రోడ్డునూ వేయలేదు. గుంటూరులోనే ఐటీ టవర్లు కట్టి వర్క్ ఫ్రం హోం విధానం తీసుకొస్తామని చెప్పారు. తాడికొండ ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించి ఇంటింటికి అందిస్తామన్నారు. తాడికొండ కొండపై వేంచేసియున్న కొండ మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఆచరణలో మాత్రం ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. మంగళగిరిలో అధికారం వచ్చిన రెండు సంవత్సరాలలోపు ఇరిగేషన్ కొండపోరంబోకు, ఫారెస్ట్ చెరువులు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి పట్టాలు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఫారెస్ట్ ప్రాంతంలో రోడ్లు వేస్తామన్నారు. వర్షాలకు కొట్టుకుపోయిన చోట్ల కూడా రోడ్లు వేయలేదు. గుంటూరు చానల్ అభివృద్ధి చేస్తామని కోతలు కోసినా బడ్జెట్‌లో కనీసం నిధులు కూడా కేటాయించలేదు.


తెనాలి రూరల్ మండల గ్రామానికి చెందిన పాతిక ఎకరాల పెద్ద రైతు పండిన ధాన్యమంతా విశాలమైన ప్రదేశంలో ఆరబెట్టుకున్నారు. గతేడాది దళారీకి అమ్మితే ఇప్పటికీ సొమ్ములు రాలేదు. అందుకే ఈ సారి ప్రభుత్వానికే విక్రయించాలని భావించారు. పది రోజులుగా ఎదురు చూస్తున్నారు. అటుకేసి అధికారులు ఎవ్వరూ వచ్చిన పాపాన కూడా పోలేదు. తెలుగుదేశం పార్టీకే చెందిన ఆ రైతు తన పేరు కూడా చెప్పడానికి ఇష్టపడటం లేదు. మరోవైపు ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేక ఆవేదన చెందుతున్నారు.

మరో కౌలు రైతుకు చెందిన రెండెకరాలలోని ధాన్యం రోడ్డు మీదనే ఉంది. సీజను మొదట్లో వచ్చిన వర్షాలకు రెండోసారి వెద జల్లాల్సి వచ్చింది. ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. దిగుబడి చూస్తేనేమో 30 బస్తాలు కూడా రాలేదు. బయటేమో దళారులు రూ.1,350కు మించి ఇవ్వమంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు. అదీ జరగటం లేదు. ఏదైనా అంటే ధాన్యం కొనకపోగా, అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలనూ తనకు రాకుండా చేస్తారేమోనని భయపడుతున్నారు.

పొలాల్లో ధాన్యం.. పోరే శరణ్యం

- మద్దతు ధర కరువుతో అన్నదాతల గుండె చెరువు
- 1.41 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు
- ఎకరానికి సగటున 35 బస్తాల దిగుబడి అంచనా
- కొనుగోలుకు ముందుకురాని కూటమి ప్రభుత్వం
- పొలాల్లోనే గుట్టలుగా రోజుల తరబడి ధాన్యం రాశులు
- గిట్టుబాటు ధర లభించక అన్నదాతల్లో కలవరం
- దళారుల దందాలతో భారీగా నష్టపోతున్న రైతులు
- 156 కొనుగోలు కేంద్రాలున్నా ప్రయోజనం మాత్రం శూన్యం

నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు వైఎస్సార్ సీపీ పిలుపు



నందివెలుగు వద్ద పొలాల్లో ధాన్యం బస్తాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలోని రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. జిల్లాలో 1.41 లక్షల ఎకరాల్లో ఈ సారి వరి సాగు చేశారు. ఇబ్బందులు వచ్చినా సగటున 35 నుంచి 40 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో ధరలు చాలా తక్కువగా ఉండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రచార ఆర్భాటమే గానీ కొనుగోలు చేయడం లేదు. మాట్లాడితే సాకులు చెబుతోంది. ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 156 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ కేవలం ఆరు వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. డెల్టాలో కాలువకు ఎగువ భూములున్న మంగళగిరి, తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్ వరిపైరు ముందుగా చేతికోస్తుంది. గత నెలలో వెంటాడిన తుపానుకు ముందే యంత్రాలతో ఒకేసారి నూర్పిడులు ఆరంభించిన విషయం తెలిసిందే. తుపాను తర్వాత నూర్పిడులు వేగం పుంజుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం తూములూరులో ఆరంభించిన విషయం తెలిసిందే.

మిల్లర్లకే బాధ్యతలు

ప్రభుత్వ ఏజెన్సీలైన మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖలతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడికక్కడే తేమశాతం పరిశీలించి, కాటాలు వేసి కొనుగోలు చేయడమనే పాత పద్ధతికి స్వస్తి పలికింది కూటమి ప్రభుత్వం. రైస్‌మిల్లర్లకు ఆ బాధ్యతను బదలాయించింది. ధాన్యం అమ్మకంపై రైతు సమాచారమిస్తే, తేమ శాతం చూసే టెక్నీషియను వస్తారు. తేమ శాతం చూసి నివేదిక పంపిస్తే, ఆ ప్రకారం రైతు దగ్గరున్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ఈ విధానంలో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం, మంత్రులు చెప్పినంత అట్టహాసంగా ధాన్యం కొనుగోళ్లు జరగటం లేదు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోతాలను ఇవ్వకపోవటం మరో సమస్య. తేమ శాతం చూశాక, ధాన్యాన్ని గోతాలకు ఎత్తి, సంబంధిత రైస్‌మిల్లుకు పంపాలి. అక్కడ మరోసారి తేమ శాతం చూసి తిప్పి పంపిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదేం తిరకాసని రైతు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందేమోనని రైతులు రోజులు తరబడి వేచి ఉంటున్నా ఫలితం కనిపించటం లేదు. దళారులను నమ్మితే ముంచేస్తారనే సందేహం వెంటాడుతున్నా, అయినకాడికి అమ్ముకోక తప్పని పరిస్థితిని ప్రభుత్వమే కల్పిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు జిల్లా మొత్తం పర్యటించి రైతులకు అండగా ఉంటామని ప్రకటించారు. మరోవైపు గురువారం ఉదయం అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ఆందోళనకు, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సన్నద్ధం అవుతున్నారు.

ఒక్క శాతం కూడా తీసుకోలేదు...



అత్తోటలో ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం తొలి కొనుగోలు కేంద్రం ఆరంభించిన తూములూరులోనే ప్రభుత్వం ఒక శాతం కూడా కొనలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పర్యటనలోనే బట్టబయలైంది. ఆ ఒక్క గ్రామమే కాదు... తెనాలి, మంగళగిరి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ధాన్యపు రాశులు కనిపిస్తున్నాయి. రోడ్లపైనా, ఖాళీస్థలాల్లో, రైతుల ఇళ్లముందు ధాన్యం ఆరబోసి ఉంటోంది. రాత్రయితే చాలు పట్టాలు కప్పి కాపలా ఉంటూ కనిపిస్తున్నారు రైతులు. తేమ శాతం చూసే టెక్నీషియన్లు పత్తా ఉండటం లేదు. దీంతో రైతు సేవాకేంద్రాలకు వెళ్లిన రైతులకు అక్కడి సిబ్బంది నిస్సహాయత వెల్లడిస్తున్నారు. ఫోన్లు చేసినా స్పందించటం లేదని రాసి మరీ ఇస్తున్నారు. ఈ నిర్లక్ష్యం వెనుక కారణమేంటనేది రైతులకు అగమ్యగోచరంగా ఉంది.

ఎల్‌టీపీలే బలి పశువులు



'ప్రణాళిక'ంతా అధికారులదే!

గుంటూరు కార్పొరేషన్‌లో అవినీతి దందా

- భారీగా పెంచేసిన బిల్డింగ్ మామూళ్లు
- కాదంటే లైసెన్స్ రద్దంటూ బెదిరింపులు
- ఇదీ టౌన్‌ప్లానింగ్ అధికారుల రాజ్యాంగం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రస్తుతం ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్)లను టార్గెట్ చేస్తున్నారు. ఒక్కసారిగా తీసుకునే మామూళ్లను పెంచేశారు. ఇవ్వడానికి నిరాకరిస్తే లైసెన్సు రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. గతంలో అపార్టుమెంట్ల నిర్మాణానికి సంబంధించి ప్రతి ఫ్లాట్‌కు మూడు వేల రూపాయలు లంచం తీసుకునేవారు. తర్వాత రూ.ఆరు వేలకు పెంచారు. ప్రస్తుతం ఆ లంచాన్ని పది వేల రూపాయలు చేశారు. అపార్టుమెంట్ కాకుండా ఇండిపెండెంట్ హౌస్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారు. దీంతో బిల్డర్లు ఈ భారాన్ని వినియోగదారులపై వేయాల్సి వస్తోంది. ఈ ఆమ్యామ్యాలను వసూలు చేసే బాధ్యతను అధికారులు ఎల్‌టీపీలపై పెట్టారు. ఎవరైనా ఇంత మొత్తం మేం ఇవ్వలేమని అడ్డం తిరిగితే వారు సమర్పించిన ప్లాన్లను బయటకు తీసి వాటిలోని లొసుగులు గుర్తించి వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారుల వేధింపులపై బిల్డర్లు నగర మున్సిపల్ కమిషనర్‌ను ఆశ్రయించినట్లు సమాచారం.



ముడుపులు ఇచ్చి...

వివిధ నగరాల్లో పనిచేసే సమయంలో అక్కడ ప్రజాప్రతినిధులు వీరిని భరించలేక బదిలీ చేయిస్తే తిరిగి భారీగా ముడుపులు సమర్పించి గుంటూరుకు చేరుకున్న కొంతమంది అవినీతి అధికారులు తాము సమర్పించిన మొత్తాన్ని మళ్లీ రాబట్టుకునేందుకు మామూళ్లను భారీగా పెంచేశారని సమాచారం. తమ అవినీతి దాహానికి ఎల్‌టీపీలను సమిధలను చేస్తున్నట్టు తెలుస్తోంది.

అధికారుల బ్లాక్‌మెయిల్

తాజాగా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఎల్‌టీపీలే ఐదు ఫ్లోర్ల వరకు ప్లాన్ మంజూరు చేసి ఫీజు చెల్లించి భవనం నిర్మాణాలను పర్యవేక్షించేలా నిబంధనలు మారుస్తున్నామని ప్రకటించారు. సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులు పొందేలా అమలు చేస్తామని ఘనంగా చెప్పారు. కానీ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటికే 1187 షార్ట్ ఫాల్స్ ఉన్నాయని ఇటీవల కార్పొరేషన్ కమిషనర్ అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలోనే వివిధ భవనాలను గుర్తించి వాటికి నోటీసులు ఇచ్చి లోటుపాట్లు సవరించుకునేలా చేయాల్సి ఉంది. దీని వల్ల మున్సిపల్ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. అయితే ఈ షార్ట్‌ఫాల్స్‌ను అడ్డం పెట్టుకుని నచ్చని వారికి నోటీసులు ఇస్తూ భారీగా డబ్బు వసూలు చేస్తూ ఇటు బిల్డర్లను అటు ఫ్లాట్ కొనుగోలుదారులను టౌన్ ప్లానింగ్ అధికారులు బ్లాక్ మెయిల్ చేస్తున్న సంగతి తెలిసిందే. కొంతమంది బిల్డర్ల విషయంలో హైకోర్టు ఆదేశాలూ తొక్కి పెట్టి ఉన్నతాధికారులకు తెలియకుండా పట్టణ ప్రణాళిక విభాగం టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. సరికొత్త మార్పులతో సరళీకృతం చేసిన జీవో వచ్చిన తర్వాత ఎల్‌టీపీలే ఆమోదిస్తారని తెలిసి, ఇప్పటికే ఎల్‌టీపీలతో వ్యక్తిగత సమావేశాలు పెడుతున్నారు. తమకు తెలియకుండా ప్లాన్లు ఆమోదిస్తే ఇబ్బందులు తప్పవంటూ అనధికారికంగా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఇటీవల ఒక ఎల్‌టీపీ విషయంలో మీ బిల్డర్ ప్లాను రద్దయిందని, నీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ వాస్తవాలను వక్రీకరిస్తూ షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఇలా వారిని భయపెట్టి తమ అదుపులో ఉండేలా టౌన్‌ప్లానింగ్ అధికారులు చేస్తున్న యత్నాల పట్ల ఎల్‌టీపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1500 గరిష్ఠం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,800

క్లుప్తంగా

డాక్టర్ విజయకు జాతీయ పురస్కారం



గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్, అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయకు 'బెస్ట్ స్ట్రోక్ కేర్ ప్రొవైడర్ ఆఫ్ ది ఇయర్' జాతీయ అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగిన స్ట్రోక్ ఇన్నోవేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ – 2024లో ఆమె ఈ అవార్డు అందుకున్నారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎస్ఓ) ప్రెసిడెంట్ డాక్టర్ జయరాజ్ పాండియన్, మాజీ ఏఐఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ పద్మా శ్రీవాత్సవ్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్ సూర్య, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బప్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలో పెరుగుతున్న పక్షవాత సమస్యలను పరిష్కరించేలా పలు అంశాలు, పరిష్కారాలు, భాగస్వామ్యాలు, విధానాలపై వారు చర్చించారు. ఈ చర్చలో డాక్టర్ విజయ 'క్వాలిటీ–డ్రివెన్ స్ట్రోక్ కేర్ – ఎక్సలెన్స్' అనే అంశానికి నిపుణుల ప్యానెలిస్ట్‌గా వ్యవహరించి తన అభిప్రాయాలను పంచుకున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) రోగులకు ఆమె చేసిన సేవల ఆధారంగా డైమండ్ స్టేటస్ అవార్డు వంటి అనేక అంతర్జాతీయ అవార్డులు లభించాయి.

యార్డుకు 50,816 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 50,816 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,551 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 43,384 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

మరో సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై దాష్టీకం





గుంటూరు నగరంలోని నల్లచెరువులో ఉంటున్న సోషల్ మీడియా యాక్టివిస్టు, మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిటెపాటి ప్రేమ్‌కుమార్‌ను ఏడుగురు వ్యక్తులు వచ్చి గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బలవంతంగా తీసుకెళ్లారు. ప్రేమ్‌కుమార్‌ను ఎవరు తీసుకెళ్లారో సమాధానం చెప్పాలంటూ గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా ఏఎస్పీ జి.వి.రమణమూర్తికి వినతిపత్రం అందించారు. ప్రేమ్‌కుమార్ భద్రతపై ఆయన సతీమణి సౌజన్య, కుమార్తె అభిసాత్విక, సోదరుడు నెహమియ్యా ఆందోళన వ్యక్తం చేశారు. – నగరంపాలెం (గుంటూరు వెస్ట్)

సరకు రవాణాలో లక్ష్య సాధన ముఖ్యం

లక్ష్మీపురం: సరకు రవాణాలో లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సరకు రవాణా వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చివరి త్రైమాసికంలో సిమెంట్, బియ్యం, ఎరువులు తదితరాల తరలింపునకు తమ ప్రణాళికలను వ్యక్తం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. రైల్వే శాఖకు పెండింగ్ బకాయిలు చెల్లించాల్సిందిగా సూచించారు. ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఈఎన్ అనూష, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ

ముగిసిన క్రీడాపోటీలు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మూడు క్రీడాంశాలలో మొత్తం 80 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీలో 30 జట్లు పాల్గొనగా, మాదల జట్టు ప్రథమ స్థానం పొందింది. వాలీబాల్‌లో 30 జట్లలో వికాస్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానం పెదకూరపాడు జట్టు కైవసం చేసుకుంది.

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త తియ్యగూర శ్రీనివాసరెడ్డి హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ నెల 11వ తేదీన విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన హ్యూమన్ రైట్స్ డే కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు తనను హ్యూమన్ రైట్స్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఆయన్ను పలువురు అభినందించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా డైక్ సెంటర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం తెలిపారు. మెడికల్ ఆఫీసర్, డెంటల్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 13 నుంచి 30వ తేదీ లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోగానీ, రిజిస్టరు పోస్టు ద్వారాగానీ అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300లు, బీసీ, ఓసీ అభ్యర్థులు రూ.500లు దరఖాస్తుతోపాటు డీడీ లేదా యూపీఐ పేమెంట్ ద్వారా చెల్లించాలన్నారు. డీడీ ద్వారా ఫీజు చెల్లించేవారు గుంటూరు మెడికల్ కాలేజీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డీడీ తీయాలని తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ప్యాలేటివ్ కేర్ ఉద్యోగానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. తెనాలి జిల్లా ఆసుపత్రిలో జనరల్ ఫిజీషియన్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. అభ్యర్థులు విద్యార్హతలు, దరఖాస్తు కోసం వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. ఈ నెల 19న జనరల్ ఫిజీషియన్ ఉద్యోగానికి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

కొనసాగిన పోలీసుల క్రీడా పోటీలు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలు గురువారం రెండో రోజూ కొనసాగాయి. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు పోటీలను పర్యవేక్షించారు. జావలిన్ త్రో, కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందేలు, టెన్నిస్, షటిల్ పోటీలు నిర్వహించారు. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు పోటీ పడ్డారు.



వాలీబాల్ ఆడుతున్న పోలీసులు

కిలారి రోశయ్యను విచారించిన పోలీసులు

పొన్నూరు: సోషల్ మీడియాలో 2020 సంవత్సరంలో పెట్టిన పోస్టు కేసులో జనసేన నేత, గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం రూరల్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. రూరల్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... తమపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారని 2020లో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులు పొన్నూరు రూరల్ స్టేషన్‌లో నియోజకవర్గానికి చెందిన 14 మందిపై ఫిర్యాదు చేశారు. వారిలో పెదకాకానికి చెందిన గోపీలాల్‌ను ఇటీవల అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మాజీ ఎమ్మెల్యే రోశయ్య కోర్టు ద్వారా బెయిల్ తీసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా విచారణ చేసినట్లు సీఐ తెలిపారు.

రాజధానిలో భూ మోసంపై కేసు నమోదు

తాడికొండ: రాజధానిలో భూ మోసంపై కేసు నమోదైంది. రాజధానికి భూమిలిచ్చి రిటర్నబుల్ ప్లాట్లు పొందిన భూమిని హక్కుదారులకు తెలియకుండా జీపీ (పవర్ ఆఫ్ అటార్నీ) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ముగ్గురి చేతులు మారిన వైనంపై తుళ్ళూరుకు చెందిన బాధితుడు మోదేపల్లి శ్రీనివాసరావు తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుళ్ళూరుకు చెందిన మోదేపల్లి శ్రీనివాసరావుకు అత్తింటి ద్వారా సంక్రమించిన ఆస్తికి సంబంధించి రిటర్నబుల్ ప్లాట్ల రూపంలో 1,900 గజాల భూమి ఉంది. ఈ భూమిని 3 నెలల క్రితం దాసరి రామ్మోహనరావు అనే గుర్తు తెలియని వ్యక్తి జీపీ (పవర్ ఆఫ్ అటార్నీ) ద్వారా ఇతరులకు విక్రయించాడు. ఇటీవల ఆన్‌లైన్‌లో పరిశీలించడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన శ్రీనివాసరావు తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాబురావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



రేపల్లె రూరల్: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆవరణలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) కోర్టు టేబుల్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అసోసియేషన్ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. న్యాయవాదులతో పాటు కక్షిదారులకు, పోలీసులకు, కోర్టు సిబ్బందికి క్యాలెండర్ ఉపయోగపడుతుందని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, కార్యదర్శి గిరిధర్, న్యాయవాదులు ఒడుగు రాంబాబు, దారం సాంబశివరావు, జి.ప్రశాంత్ కుమార్, కొండపల్లి శ్రీనివాసరావు, రవికుమార్, ఐజాక్, ఎం.కృష్ణారామ్, పి.నాగాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాంబాబు

యద్దనపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం యద్దనపూడికి చెందిన పాలెపోగు రాంబాబును పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు తాడేపల్లి కేంద్ర కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసి తిరిగి అధికారంలోకి రావడం కోసం శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈయన గతంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారు.

మైనింగ్‌కు నిబంధనలు పాటించాలి



బొల్లాపల్లి: నిబంధనల ప్రకారం అటవీ శాఖ పరిధిలో మైనింగ్ నిర్వహించాలని జిల్లా ఫారెస్ట్ అధికారి జి.కృష్ణప్రియ అన్నారు. మండలంలోని మర్రిపాలెం ప్లాంటేషన్, రేమిడిచర్ల అటవీ పరిధిలో మైనింగ్ ప్రాంతాన్ని, బొల్లాపల్లిలో ఫారెస్ట్ భూమిని గురువారం తనిఖీ చేశారు. మర్రిపాలెం ప్లాంటేషన్ శుభ్రంగా ఉంచాలని సూచించారు. అటవీ శాఖ పరిధిలో మైనింగ్ తవ్వకాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మైనింగ్ తవ్వకాలను తనిఖీ చేశారు. తగిన అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ రేంజర్ సి.మాధవరావు, బీఆర్‌వో ఎం.సురేంద్రబాబు, ఎఫ్‌బీవో కె.నాగార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా 50వ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 14వ తేదీన రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుబ్బరాజు, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు వెంట ఆధార్ కార్డ్ తీసుకురావాలని స్పష్టం చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు కళాశాల వ్యాయామ అధ్యాపకుడు రాయల ఆంజనేయులు 90635 77055 సంప్రదించాలని పేర్కొన్నారు.

దుగ్గిరాలకు బాధిత పసుపు రైతులు రావాలి

తెనాలి: దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజి అగ్నిబాధిత పసుపు రైతులు ఈ నెల 16, 17వ తేదీల్లో తమ వద్దనున్న ఆధారాలతో దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు వద్దకు రావాల్సిందిగా పసుపు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి వెల్లడించారు. ఈ సమస్యపై గురువారం సాయంత్రం సబ్ కలెక్టర్ వి.సంజనా సింహను ఆమె కార్యాలయంలో వారు కలిశారు. అగ్నిప్రమాదానికి సంబంధించి హైదరాబాద్ నుంచి ఫోరెన్సిక్ ఫైర్ ఆఫీసర్ జుబేదార్ ఈ నెల 16, 17వ తేదీల్లో వస్తున్నట్లు సబ్ కలెక్టర్ తెలియజేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన సందర్శిస్తారని చెప్పారు. ఆయా తేదీల్లోనే బాధిత రైతులకు సంబంధించి ఒరిజినల్ బాండ్లు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డులను పరిశీలిస్తారని వివరించారు. ఒరిజినల్ బాండ్లు బ్యాంకులో ఉన్న రైతులు సంబంధిత వివరాలను తీసుకుని రావాలని రైతు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.



సబ్ కలెక్టర్ సంజనా సింహతో రైతు సంఘ నేతలు

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ అన్నారు. సుమారు రూ.33 లక్షల విలువైన 220 సెల్‌ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయ (ఆవరణ) లోని సమావేశ మందిరంలో గురువారం బాధితులకు అందించారు. తమిళనాడు నుంచి మూడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఒక్కొక్క ఫోన్ చొప్పున కూడా తీసుకువచ్చినట్లు చెప్పారు. ఫోన్లు పోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 86888 31574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెచ్‌సీ కిషోర్, పీసీలు శ్రీధర్, ఇమాంసాహెబ్, గౌస్ బాషా, మానస, సీసీ హెచ్‌సీ రమేష్, పీసీ కరీముల్లాను జిల్లా ఏఎస్పీ అభినందించారు.



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

రాళ్లతో దాడి చేసి వ్యక్తి హత్య

గుంటూరు రూరల్: పాత సామాను వ్యాపారిని రాళ్లతో దాడి చేసి హత్య చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ (40) దారుణ హత్య గురయ్యాడు. షరీఫ్ గుంటూరు లాలాపేట రోడ్‌లో ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద పని చేస్తున్న ఆర్ అగ్రహారానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిసింది. ఆమెకు భర్త లేకపోవడంతో షరీఫ్ నేరుగా ఆమె ఇంటికి వెళుతూ ఉండేవాడని, మద్యం తాగి అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడని సమాచారం. ఈ నేపథ్యంలో ఆ మహిళ కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉండేవాడని తెలిసింది. షరీఫ్ ప్రవర్తనలో మార్పు మాత్రం రాలేదు. 10వ తేదీ రాత్రి గుంటూరు శివారు కేవీపీ కాలనీ రోడ్డు భవానీపురం ప్రాంతం వైపు మద్యం తాగడానికి షరీఫ్‌ను యువకుడు తీసుకెళ్లాడని తెలిసింది. అతడి వెంట ఇద్దరు మిత్రులు కూడా ఉన్నట్లు సమాచారం. అందరూ మద్యం తాగారని... తర్వాత షరీఫ్‌పై రాళ్లతో దాడి చేసి మిగతా ముగ్గురు హతమార్చారని తెలిసింది. గురువారం ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికి అటుగా వెళ్లగా మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. భవానిపురం పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో ప్రత్యేక పోలీసు బీట్లు నిర్వహిస్తామని వివరించారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం షరీఫ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. షరీఫ్‌కు గతంలో వివాహమైందని, కొన్నాళ్లకే భార్య వెళ్లిపోయినట్లు తెలిసింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వంశీధర్

బైక్ కొనివ్వలేదని తాళంచెవులు మింగిన యువకుడు

గుంటూరు మెడికల్: బైక్ కొనివ్వలేదని ఇంట్లో వారితో గొడవపడి నాలుగు తాళంచెవులు మింగిన వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కోత, కుట్లు లేని అరుదైన శస్త్ర చికిత్స చేసి కడుపు నుంచి వాటిని తీశారు. ఈ విషయాన్ని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత గురువారం మీడియాకు వెల్లడించారు. నరసరావుపేటకు చెందిన దేవర భవానీ ప్రసాద్ కార్పెంటర్. బైక్ కావాలని తల్లిదండ్రులతో గొడవ పడి నాలుగు తాళంచెవులు మింగాడు. చికిత్స కోసం జీజీహెచ్‌కు తీసుకురాగా, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అడ్మిట్ చేశారు. కోత, కుట్లు లేకుండా నూతన చికిత్స విధానంలో యువకుడి కడుపు నుంచి తాళంచెవులు తొలగించినట్లు డాక్టర్ కవిత వెల్లడించారు. ఎండోస్కోపీ ద్వారా ఐదు నిమిషాల వ్యవధిలోనే బయటకు తీసి ప్రాణాలు కాపాడామన్నారు. ఈ ప్రక్రియలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ అనిల్ పాల్గొన్నట్లు తెలిపారు.



యువకుడితో డాక్టర్ కవిత

క్షణికావేశంలో తల్లి, కుమార్తె ఆత్మాహుతియత్నం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఆస్తి విషయమై తల్లి, కుమార్తె మధ్య జరిగిన వాగ్వాదంలో క్షణికావేశంలో ఇద్దరు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మాహుతియత్నం చేశారు. గుంటూరులోని నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారం 17వ లైన్ ప్రాంతానికి చెందిన పుచ్చం సుబ్బులు, నర్సిరెడ్డి దంపతులకు ఇద్దరు మగ, ఐదుగురు ఆడ సంతానం. నర్సిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. సుబ్బులుకు తోడుగా లక్ష్మీనగర్‌కు చెందిన పెద్ద కుమార్తె కొత్తపల్లి రమణ ఉంటోంది. బుధవారం పెద్ద కర్మ పూర్తి అయింది. తరువాత ఆస్తి విషయంలో వారిద్దరు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఇంట్లో ఉన్న కిరోసిన్ ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకున్నారు. వారి కేకలు విని స్థానికులు మంటలను అదుపు చేసి కాపాడారు. నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రుద్ర ట్రస్ట్ సహాయంతో తల్లీకుమార్తెలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





బాధితులు సుబ్బులు, రమణ

మాఫియాకు పోలీసుల కోపరేషన్

- తనిఖీకి వెళ్లిన సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దారు
- ఎందుకు వెళ్లారంటూ కానిస్టేబుల్ ఫోన్
- సీఐతో మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సీఎస్‌డీటీ
- కానిస్టేబుల్ ఫోన్ స్విచ్ఛాఫ్
- సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలోనే ఘటన



తెనాలి రూరల్: సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలిలోనే పోలీసుల కనుసన్నల్లో రేషన్ మాఫియా కొనసాగుతోందని తాజా ఘటన ఒకటి ధృవీకరించింది. ఇక్కడ పోలీసులు రెవెన్యూ అధికారులకు అడ్డుపడుతుండడం విశేషం. రేషన్ పంపిణీ సరిగా జరగడం లేదని, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనం ద్వారా కాకుండా రేషన్ షాపులోనే సరుకులను ఇస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో రేషన్ దుకాణ తనిఖీకి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) మూర్తి గురువారం పట్టణ చినరావూరులోని ఓ రేషన్ దుకాణం తనిఖీకి తన సిబ్బందితో వెళ్లారు. వాహనం మరమ్మతుకు గురవడంవల్లే రేషన్ షాపులో ఇస్తున్నారని ఆయన నిర్ధారించుకున్నారు. ఈలోగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తన స్థాయిని మరచి సీఎస్‌డీటీ మూర్తికి ఫోన్ చేసి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఇక తనిఖీల అనంతరం తన కార్యాలయానికి వెళ్లే క్రమంలో ఇదే విషయమై సీఐతో మాట్లాడి ఫిర్యాదు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సీఎస్‌డీటీ వెళ్లి రైటర్‌ను కలవగా సీఐ సెలవులో ఉన్నారని.. రూరల్ సీఐ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తనకు వచ్చిన నంబరును రైటర్‌కు వచ్చి ఎవరిదో చూడమని అడగ్గా అది అదే స్టేషనులో పనిచేస్తున్న కానిస్టేబుల్‌ది అని తేలింది. డయల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చినరావూరులోని రేషన్ దుకాణానికి సమీపంలోని ఓ కార్ఖానాకు రేషన్ బియ్యం తరలుతోందన్న ఆరోపణలున్నాయి. దీనికి పోలీసుల సహకారం ఉందన్నది ఆ ప్రాంతంలో బహిరంగ రహస్యమే. అక్కడి రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు సీఎస్‌డీటీ వెళ్లడంతో ఖంగుతిన్న సదరు కానిస్టేబుల్ సీఎస్‌డీటీకి ఫోన్‌చేశాడని తెలుస్తోంది. రేషన్ మాఫియా వ్యవహారాలను వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో పర్యవేక్షిస్తున్నందునే సదరు కానిస్టేబుల్‌కు రేషన్ దుకాణ తనిఖీ సమాచారం రావడంతో వెంటనే సీఎస్‌డీటీకి ఫోన్ చేశాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ వ్యవహారాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా, కానిస్టేబుల్ ఫోన్‌చేయడం నిజమేనని, ఘటనపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే, ఇదే విషయమై ఇన్‌చార్జి సీఐ బెల్లం శ్రీనివాసరావును సంప్రదించగా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు రాలేదని, ఏ నంబరు నుంచి ఫోన్ వచ్చిందో దానిని తెలియజేస్తూ ఫిర్యాదు వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు.

సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకులకూ సహకారం..

ఇదిలా ఉంటే.. డీఎస్పీ తనకు బాగా పరిచయస్తుడని, ఏదైనా వ్యవహారం ఉంటే తాను సర్దుబాటు చేయగలనంటూ పట్టణంలో సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకులకు 'సహకారం' అందిస్తున్న ఇదే స్టేషనుకు చెందిన కానిస్టేబుల్ ఒకరు బహిరంగంగానే చెప్పుకుంటున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.